క్లుప్తంగా

ఎస్సై ఉద్యోగం సాధించిన పేదింటి యువకులు



అంతటి కృష్ణ

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండల కేంద్రానికి చెందిన అంతటి కృష్ణ ఎస్సై ఉద్యోగం సాధించాడు. ఈయన బీటెక్ పూర్తి చేసి, ప్రయివేట్ జాబ్ చేస్తున్నాడు. తల్లితండ్రుల కోరిక మేరకు ఆ ఉద్యోగాన్ని వదులుకొని ఎస్సై పరీక్షకు సన్నద్ధమయ్యాడు. ఇటీవల విడుదలైన ఎస్సై పరీక్షా ఫలితాల్లో ఉద్యోగం సాధించడంతో తల్లితండ్రుల కోరిక నెరవేరింది. కాగా.. కృష్ణ సోదరులు ఆంజనేయులు ఎఫ్‌సీఐలో, జగన్ విద్యుత్ ఏఈ ఉద్యోగం చేస్తున్నాడు.

రిక్షా కార్మికుడి కుమారుడు



పల్లెబోయిన శంకర్‌యాదవ్

నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన పల్లెబోయిన శంకర్ యాదవ్ ఇటీవల ప్రకటించిన ఎస్సై ఫలితాల్లో ఎస్సై ఉద్యోగం సాధించాడు. తండ్రి పల్లెబోయిన వెంకయ్య రిక్షా కార్మికుడిగా పని చేస్తుండగా తల్లి లింగమ్మ రోజు వారి కూలీగా చేస్తుంది. శంకర్ ఎన్జీ కళాశాలలో బీఎస్సీ కోర్సు పూర్తి చేశాడు. 2022లో ఆర్ఆర్‌బీ జాబ్ వచ్చింది. ఎస్సై ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడడంతో ఆ ఉద్యోగాన్ని వదులుకుని, ఎస్సై పరీక్షకు సన్నద్ధమై ఉద్యోగం సాధించాడు.

యాదవుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



యాదవులకు గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్

చండూరు(గట్టుప్పల్): యాదవుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ పల్లె కళ్యాణి, జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం అన్నారు. బుధవారం గట్టుప్పల్ మండల కేంద్రంలో యాదవులకు గొర్రెల యూనిట్లను వారు సర్పంచ్ ఇడెం రోజాతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో తేరట్‌పల్లి ఎంపీటీసీ గొరిగె సత్తయ్య, బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఇడెం కైలాసం, పెంపకందారుల సంఘం అధ్యక్షుడు కుండె సత్తయ్య, స్వామి, ముత్తిరెడ్డి, కురుమ సంఘం నాయకులు కుండె వెంకటేశం, మందుల శంకర్, పెద్ద కురుమకుండె శ్రీశైలం, కుండె సత్తయ్య, కాస యాదయ్య, పున్న కిషోర్, రాంబాబు, జెల్లు, కుమార్ పాల్గొన్నారు.

గద్దర్‌కు నివాళి



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: ప్రజా గాయకుడు గద్దర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బొంగరాల నర్సింహ, ప్రధాన కార్యదర్శి బొమ్మిడి నగేష్ అన్నారు. బుధవారం నల్లగొండలోని శ్రామిక భవన్‌లో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్ తన జీవితాన్ని మొత్తం బడుగు, బలహీనవర్గాల కోసం త్యాగం చేసిన గొప్ప కళాకారుడన్నారు. ఆయన మృతి సాంస్కృతికోద్యమానికి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో బీవీ చారి, రావుల వీరేష్, కత్తుల చంద్రశేఖర్, ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.

'ఆరోగ్యలక్ష్మి'ని సద్వినియోగం చేసుకోవాలి

కట్టంగూర్: గర్భిణులు ఆరోగ్యలక్ష్మి భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి శ్వేత అన్నారు. బుధవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చెర్వుఅన్నారం, గార్లబాయిగూడెం, అయిటిపాముల, రసూల్‌గూడెం గ్రామాలకు చెందిన గర్భిణులకు ఆమె ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, భోజనం అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద పాల్గొన్నారు.

యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్

కట్టంగూర్: రాష్ట్ర యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కట్టంగూర్ మండలంలోని పరడ గ్రామానికి చెందిన మంగదుడ్ల శ్రీనివాస్ నియామకమయ్యారు. ఈమేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'గృహలక్ష్మి' దరఖాస్తుల పరిశీలన

చండూరు(గట్టుప్పల్): ఘటుప్పల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరుగుతున్న గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఇడెం కైలాసం పరిశీలించారు. గృహలక్ష్మి పథకాన్ని గ్రామీణ పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ పోరెడ్డి ముత్తిరెడ్డి, అంతంపేట గ్రామ శాఖ అధ్యక్షుడు ఐతరాజు హనుమంతు తదితరులు ఉన్నారు.

వెటర్నరీ సిబ్బంది లేక అవస్థలు

- అత్యవసర సమయంలో అందని వైద్యం
- మృత్యువాత పడుతున్న పశువులు
- సిబ్బందిని నియమించాలని కోరుతున్న రైతులు



మామిడాలలో సిబ్బంది లేక తాళం వేసి ఉన్న వెటర్నరీ సెంటర్

రామగిరి(నల్లగొండ): వెటర్నరీ సెంటర్లలో సిబ్బంది లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తిప్పర్తి మండలంలో పశు వైద్యశాలతో పాటు అనిశెట్టి దుప్పలపల్లి, పజ్జూరు, మామిడాల గ్రామాల్లో మరో మూడు సబ్ సెంటర్లు ఉన్నాయి. సబ్ సెంటర్లలో సరైన సిబ్బంది లేక పశువులకు అత్యవసర సమయంలో వైద్యం అందడం లేదు. దీంతో పశువులు మృతి చెందుతున్నాయి.

సబ్ సెంటర్‌కు తాళం వేసి ఉండడంతో..

మామిడాల గ్రామానికి చెందిన గోనే కరుణాకర్ గేదెకు అనారోగ్యంగా ఉండడంతో బుధవారం వైద్యం చేయించడానికి గ్రామంలో ఉన్న సబ్‌సెంటర్‌కు తోలుకెళ్లాడు. అక్కడ తాళం వేసి ఉండడంతో గేదెకు వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇటీవల ఇదే గ్రామంలో మర్రి సైదులు, బొల్లెద్దు కృపయ్య, బొల్లెద్దు పరశురాముడు గేదేలు కుక్క కరిచి చనిపోగా, మర్రి శివ, అనుములపూరి రామచంద్రుకు చెందిన గేదె దూడ పాము కాటుకు గురై వైద్యం అందక మృత్యువాత పడింది. ఇలా ఆయా సబ్ సెంటర్ల పరిధిలో అనేక పశువులు వైద్యం అందక మృతి చెందుతున్నాయి. వైద్య సిబ్బందిని నియమించి పశువులకు వైద్యం అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి



మామిడాల గ్రామంలో ఉన్న వెటర్నరీ సబ్ సెంటర్‌లో వైద్య సిబ్బందిని నియమించాలి. సెంటర్‌లో సిబ్బంది లేకపోవడంతో ఆరు సంవత్సరాలుగా పశువుల వైద్యానికి చుట్టుపక్కల గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందుబాటులో లేకపోవడంతో పశువులు మృత్యువాత పడుతున్నాయి.

– గోనె కర్ణాకర్, మామిడాల

అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ

- నల్లగొండ మున్సిపల్ కమిషనర్ రమణాచారి



శ్మశాన వాటికలో అభివృద్ధి పనులపై సూచనలు చేస్తున్న కమిషనర్ రమణాచారి

నల్లగొండ టూటౌన్: పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, పనుల్లో నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రమణాచారి అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని రహదారి విస్తరణ, రైతు బజారు, వైకుంఠ ధామాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని, ఆలస్యం జరిగే చోట ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. శ్మశాన వాటికల పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని కోరారు. జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ ఉన్నందున ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఏసీపీ నాగిరెడ్డి, డీఈ నరసింహారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ తదితరులున్నారు.

సమయపాలన పాటించాలి

శానిటేషన్ కార్మికులు సమయపాలన పాటించాలని మున్సిపల్ కమిషనర్ రమణాచారి సూచించారు. బుధవారం ఉదయం 5 గంటలకు పాత బస్తీలో పర్యటించి కార్మికుల హాజరు వివరాలు పరిశీలించారు. కార్మికులను కావాల్సిన చేతి గ్లౌజులు, పరికరాలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

అనాథ పిల్లల వివరాలు పక్కాగా సేకరించాలి

23 సంవత్సరాలలోపు అనాథ పిల్లల వివరాలను పక్కాగా సేకరించాలని మున్సిపల్ కమిషనర్ రమణాచారి అన్నారు. బుధవారం నీలగిరి మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మెప్మా ఆర్పీలు, వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తల్లిదండ్రులు చనిపోయిన 23 సంవత్సరాల లోపు పిల్లల వివరాలు పూర్తిగా సేకరించి ట్యాబ్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివే పిల్లలు కాకుండా చదువు మధ్యలో మానేసిన వారు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారు అర్హులని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిప్ ఈఈ రాములు, ఏసీపీ నాగిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



మంత్రి జగదీష్‌రెడ్డిని కలిసిన భూనిర్వాసితులు

మర్రిగూడ: మునుగోడు ఉప ఎన్నికలో భూనిర్వాసితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ చర్లగూడ భూనిర్వాసితులు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డిని కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. స్పందించిన మంత్రి నిర్వాసితులకు కల్పించిన హక్కులను అమలు చేయడంతోపాటు ప్రతి హామీని అమలు చేసే విధంగా అధికారులతో మాట్లాడి చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. ముంపు గ్రామాల ప్రజలకు పునరావాస ప్రక్రియతోపాటు ఇంటి స్థలాన్ని కేటాయించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో వల్లపు కేశవులుగౌడ్, సంకబుడ్డి శ్రీనివాస్‌యాదవ్, తొడేటి వెంకన్న, ఎరుకలి శేఖర్‌గౌడ్, ముంత నర్సింహ, శంకరయ్య తదితరులున్నారు.

ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు



108 వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ టౌన్: ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేసి, జీజీహెచ్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని, జిల్లా ప్రజలకు సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ఇటీవల జిల్లాకు కొత్తగా వచ్చిన 108, 102 వాహనాలను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్, ఎక్స్‌రే విభాగాన్ని పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజకుమారి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లచ్చు, మాండ్ర వెంకన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

- కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చలమల్ల కృష్ణారెడ్డి



గానుగుపల్లిలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న చలమల్ల కృష్ణారెడ్డి

నాంపల్లి: కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు బుధవారం ఆయన నాంపల్లిలో పాదయాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర గానుగుపల్లి, చిన్నమమ్మాదాపురం, మమ్మాదాపురం, గట్లమల్లేపల్లి, అడవి తుమ్మలపల్లి, రెవల్లి గ్రామాల మీదుగా కొనసాగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అవినీతి సొమ్మును కూడగట్టి ప్రజలకు లేనిపోని, అమలు కాని పథకాలను ఎన్నికల ఎరగా వేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ మాయల మరాఠీ అని, ఆయన మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. గురువారం నాంపల్లిలోనే రెండవ రోజు పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము భిక్షం, పానగంటి వెంకటయ్య, మట్టిపల్లి యాదయ్య, వెంకట్‌రెడ్డి, ఎస్‌కే చాంద్‌పాష, నాంపల్లి సంజీవ, కోటేష్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన ఉండాలి

- ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న వీసీ గోపాల్‌రెడ్డి

ఎంజీయూ(నల్లగొండ రూరల్): ఆదివాసీలు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని మహాత్మా గాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం ఎంజీయూలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక ప్రాంతాల్లో ఆదివాసీలపై హింస, అణిచివేత సర్వసాధారణమైందని ఆవేదన వ్యక్తం చేశారు. వనరుల దోపిడీకి ఆదివాసులు అడ్డుగా మారడంతో, వారిని అడవి నుంచి వెళ్లగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఆదివాసీలు అభివృద్ధికి దూరంగా ఉన్నారని, వారి అభివృద్ధికి విద్యార్థులు, యువత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణారావు, అధ్యాపకులు రవి, ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ రెడ్డి, ఆనంద్, రమావత్ మురళి, నవీన్, రమేష్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు అండగా తెలంగాణ ప్రభుత్వం

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, పాల్గొన్న డీలర్లు



నకిరేకల్‌లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నల్లగొండ: రేషన్ డీలర్ల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. డీలర్ల కమీషన్ పెంచినందుకుగాను బుధవారం క్లాక్ టవర్ సెంటర్‌లో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పారెపల్లి నాగరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రేషన్ డీలర్ల కమీషన్ క్వింటాకు రూ.20 ఉండగా, కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.70కి పెంచారని, ప్రస్తుతం వారి ఇబ్బందులను గుర్తించి రూ.140కి పెంచారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఒక విజన్‌తో పని చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి నాగరాజు ప్రధాన కార్యదర్శి వైద్యుల సత్యనారాయణ, కోశాధికారి కోటగిరి సూర్యనారాయణ, మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు వీళ్ల సులోచన వెంకట్ దేవరకొండ డివిజన్ అధ్యక్షులు బుర్ర శంకర్ నాయక్, నల్లగొండ డివిజన్ కార్యదర్శి ఉపేందర్, జిల్లా నాయకులు బోగిపర్తి సత్యనారాయణ, కోట్ల అశోక్, గొల్ల వేణుగోపాలరావు, యాదయ్య, శ్రీకాకుళం చంద్రయ్య, సులేమాన్, రవికుమార్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నకిరేకల్: రేషన్ డీలర్ల కమీషన్‌ను క్వింటాకు రూ.70 నుంచి 140కి పెంచడాన్ని హర్షిస్తూ నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఆవరణలో బుధవారం రేషన్ డీలర్ల సంఘం నాయకులతో కలిసి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాధ ధనలక్ష్మి, తలారి బలరాం, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు జాఫర్, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



నల్లగొండలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ నాయకులు

నల్లగొండ: యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గౌని రాజా రమేష్ యాదవ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి క్రియాశీలకంగా పని చేయాలన్నారు. అనంతరం యూత్ కాంగ్రెస్ జిల్లా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్ యాదవ్, గాలి నాగరాజు, చందు, శ్రీనివాస్ యాదవ్, బాలకృష్ణ రహీం, రాజిరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: నకిరేకల్‌లో టీపీసీసీ నేత దైద రవీందర్ ఆధ్వర్యంలో బుధవారం యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మెయిన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన జెండాను ఆయన ఎగురవేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు రెడ్డి పల్లి వీరస్వామి, అల్లి అంజన్ యాదవ్, రియాజ్‌ఖాన్, యూసఫ్, అబ్దుల్ మజీద్, బండారు ఆనంద్, యర్కల లక్ష్మణ్‌గౌడ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నకిరేకల్‌లో యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు గుండా జలందర్‌రెడ్డి ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. వేడుకల్లో వేదాసు శ్రీధర్, ప్రసన్నరాజ్ పాల్గొన్నారు.

మర్రిగూడ: మర్రిగూడ మండల కేంద్రంలో బుధవారం యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బేత వెంకటేష్, సుధాకర్, ఇబ్రహీం, సాయికుమార్, నాగార్జున, శేఖర్ ఉన్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

రామగిరి(నల్లగొండ): కుక్కల దాడిలో గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన తిప్పర్తి మండలంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన ముచ్చపోతుల సోమయ్య గ్రామంలోని దొడ్డి వద్ద గొర్రెలను ఉంచాడు. మంగళవారం రాత్రి గొర్రెల మందపై కుక్కల దాడి చేశాయి. దాడిలో 4 గొర్రెలను కొరికి చంపేశాయి. బుధవారం ఉదయం దొడ్డి వద్దకు వచ్చి చూడగా గొర్రెలు మృతి చెంది ఉన్నాయి. అయితే 20 రోజుల క్రితం జరిగిన కుక్కల దాడిలో 7 గొర్రెలు చనిపోయాయి. చనిపోయిన గొర్రెలతో బుధవారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

సంక్షిప్త సమాచారం

• గ్రూప్ – 2 పరీక్ష వాయిదా వేయాలి

రామగిరి(నల్లగొండ): గురుకుల, జేఎల్ పరీక్షల నేపథ్యంలో గ్రూప్ – 2 పరీక్ష వాయిదా వేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కంభంపాటి శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నల్లగొండలోని సుభాష్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుండాల నరేష్, నాయకులు కిరణ్, సైదులు, అంజి, నవీన్,రాజు, నగేష్, తరుణ్, అనిల్, కార్తీక్, రాము పాల్గొన్నారు.

• బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

కనగల్: మండల పరిధిలోని తేలకంటిగూడెం గ్రామానికి చెందిన నామ లక్ష్మయ్య, కనగల్ గ్రామానికి చెందిన కంబాలపల్లి లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే కంచర్ల బుధవారం రూ.10వేల చొప్పున అందించిన ఆర్థికసాయాన్ని ఎంపీపీ కరీం పాష, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్ గురువారం స్థానికంగా పంపిణీ చేశారు.

• స్నేహితుడికి ఆర్థిక చేయూత

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన నాతి అజయ్‌కుమార్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వైద్య చికిత్స ఖర్చులకుగాను అతడితో కలిసి చదువుకున్న పదో తరగతి విద్యార్థులు సేకరించిన రూ.15,500 ఆర్థిక సాయాన్ని బుధవారం స్థానికంగా అందజేశారు. వారిలో శివకుమార్, బొడ్డుపల్లి శ్రీను, రామ్‌రెడ్డి, అరవింద్, శ్రీను, వెంకటేష్, ప్రదీప్ పాల్గొన్నారు.

• ఆర్థికసాయం అందజేత

నకిరేకల్: మండలంలోని చందుపట్ల గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పెద్ది వెంకటేశ్వర్లుకు బీజీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగధర్‌రావు బుధవారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట లక్ష్మీనారాయణ, రాధాకృష్ణ, రాజు, పంది సాగర్, కొప్పు సందీప్, కొండ కోటేష్ తదితరులున్నారు.

• బ్లడ్ గ్రూపులపై అవగాహన

కనగల్: ప్రతి ఒక్కరికీ బ్లడ్ గ్రూప్ నమూనాలపై అవగాహన ఉండాలని జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఆరూరి జానయ్య అన్నారు. బుధవారం కనగల్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు బ్లడ్ గ్రూప్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వరూధిని, పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు, ఎర్ర శ్రీరాములు, ఫిజికల్ డైరెక్టర్ సాజిద్ అలీ, వెంకటయ్య పాల్గొన్నారు.

• ప్రభుత్వ పథకాలపై అవగాహన

చిట్యాల: పట్టణ ప్రగతి స్వనిధి సమృద్ధి పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలపై చిట్యాల మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చిరువ్యాపారులకు మెప్మా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వైస్‌చైర్మన్ లింగస్వామి, కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, లేబర్ ఆఫీసర్ శేషారత్నం, సివిల్ సప్లయ్ ఆర్ఐ లింగస్వామి, మెడికల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రోజా, మెప్మా టీఎంసీ సరిత, కౌన్సిలర్ సత్తయ్య పాల్గొన్నారు.

• పెట్రోల్ బంక్‌లో వ్యక్తిని బెదిరించిన ముగ్గురిపై కేసు

నాంపల్లి: మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న వ్యక్తిపై మండల కేంద్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి బెదిరింపులకు పాల్పడినందుకుగాను కేసు నమోదైంది. ఈమేరకు ఎస్ఐ లచ్చిరెడ్డి బుధవారం వివరాలు వెల్లడించారు. నాంపల్లికి చెందిన షేక్ రఫీ, షాకీర్, హల్దావ్ అనే ముగ్గురు యువకులు స్థానిక భారత్ పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లారు. పెట్రోల్ కోసం అందులో నిద్రపోతున్న వ్యక్తిని పిలిచారు. అతను ఎంత పిలిచినా లేవకపోవడంతో ఆ ముగ్గురు చాకుతో అతడిని బెదిరించారు. దీంతో ముగ్గురి యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం

కనగల్: పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డీపీఎస్ ఫణికుమార్, కాళం నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కనగల్ మండలంలోని ఇస్లాంనగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ గురుకుల పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత నమోదు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షకార్యదర్శులు తిరందాసు సత్తయ్య, ఏమిరెడ్డి సైదిరెడ్డి, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు తరాల పరమేష్, జానారెడ్డి, యూసుఫ్‌పాష, వెంకట్‌రెడ్డి, శంకరయ్య, భాస్కర్, రామకృష్ణారెడ్డి తదితరులున్నారు.

గడువు పెంచాలి

మునుగోడు: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునే గడువు మరో 20 రోజుల పాటు పెంచాలని మాజీ ఎంపీటీసీ పందుల భాస్కర్ కోరారు. బుధవారం ఆయన మునుగోడులో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో మద్యం దుకాణాల టెండర్ కోసం దాదాపు 15 రోజుల పాటు సమయం ఇచ్చిన ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి కేవలం 2 రోజుల గడువు ఇవ్వడం దారుణమన్నారు. గడువు పెంచి అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

నకిరేకల్: నకిరేకల్ మున్సిపాలిటీలోని 9వ వార్డులో రూ. 5లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు నోముల విజయ్‌కుమార్, నాయకులు రాచకొండ వెంకన్నగౌడ్, నడికుడి వెంకన్న, గుర్రం గణేష్, యాతాకుల సోమయ్య, దైద సుందర్, శ్రీకాంత్, శ్రావణ్, దైద అఖిల్, చందు తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

మునుగోడు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు, సామగ్రి కోల్పోయిన వరద బాధితులను ఆదుకునేందుకు మునుగోడులో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో దాతల నుంచి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు యసరాని శ్రీను, వేముల లింగస్వామి, సాగర్ల మల్లేష్, ఎర్ర లింగయ్య పాల్గొన్నారు.

సైనికుల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం కృషి



నల్లగొండలో మాజీ సైనికులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్: దేశ రక్షణకు పనిచేసే సైనికులు ప్రజలకు, యువతకు ఆదర్శమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈనెల 30 వరకు 'నేను పుట్టిన నేల.. నన్ను కన్న దేశం' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈమేరకు బుధవారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో వీరులకు వందనం పేరుతో మాజీ సైనికులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని మోదీ సైనికుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశం కోసం, ప్రజల కోసం పోరాటం చేసే సైనికుల రుణం ప్రజలు ఎప్పటికీ మరిచిపోరన్నారు. కార్యక్రమంలో పార్టీ కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్ రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, దాసోజు యాదగిరాచారి, లింగస్వామి, అనిల్‌కుమార్, రావెళ్లి కాశమ్మ, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాపిరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నకిరేకల్: 'నేను పుట్టిన నేల.. నన్ను కన్న దేశం' కార్యక్రమంలో భాగంగా బుధవారం నకిరేకల్ మండలం తాటికల్ గ్రామంలో స్వాతంత్ర సమరయోధులు, జవాన్ల, పోలీసు కుటుంబాల్లో 75 ఏళ్లు దాటిన ఆదిరాల దుర్గారావు, కొత్వల నిర్మల, జిల్లాల నాగిరెడ్డిలను బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు యానాల శ్రీనివాస్‌డ్డి, చెనగాని రాములు, మండల వెంకన్న, ఉప్పల నాగరాజు తదితులు పాల్గొన్నారు.

రెండవ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



నిరసన తెలుపుతున్న ఏఎన్ఎంలు

నల్లగొండ టౌన్: జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నల్లగొండలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 16 ఏళ్లుగా పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలను నేటికీ రెగ్యులర్ చేయకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో రెండవ ఏఎన్ఎంల సంఘం నాయకులు సరళ, నాగమణి, వై.శోభ, రాణి, జే.లలిత, సులోచన, పద్మ, పార్వతి, జి.పుష్ప, చంద్రకళ, అండమ్మ, గీత, అండాలు, మంజుల, సరిత, సాలమ్మ, లెనిన్ పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు, కాంగ్రెస్ నాయకులు

కేతేపల్లి: మణిపూర్‌లో క్రైస్తవులు, మహిళలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ కేతేపల్లి మండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం కేతేపల్లిలో శాంతి ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. పాస్టర్లు మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ర్యాలీకి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వేదాసు శ్రీధర్, మహిళా నాయకురాలు చెరుకు లక్ష్మి, కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు ఎన్.మంగమ్మ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల గౌరవ అధ్యక్షుడు, క్రీస్తు సాక్షి బ్రదర్ థామాసయ్య, అధ్యక్షుడు జీవప్రకాష్, ప్రతినిధులు సమీర్, ప్రవీణ్, హనోక్, ప్రేమ్‌దాస్, జానయ్య పాల్గొన్నారు.